అభివృద్ధిలో తిరోగమన దిశగా నల్లగొండ పట్టణం

• మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ , మార్చి18: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అధిక నిధులు తీసుకొచ్చి నల్లగొండను అభివృద్ధి పథంలో తీసుకెళ్లానని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పట్టణం అభివృద్ధిలో తిరోగమన దిశగా వెళ్తున్నదని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన హయాంలో నల్లగొండలో రోడ్ల వెడల్పు, పట్టణ సుందరీకరణలో భాగంగా ఎన్జీ కళాశాల వద్ద రోడ్డు వెడల్పు, జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం వద్ద జంక్షన్ సుందరీకరణలో సుమారు 30 మంది స్ట్రీట్ వెండర్లను అక్కడ నుంచి పంపించామన్నారు. పనులు పూర్తయిన తర్వాత స్ట్రీట్ వెండర్స్ కోసం ఎన్జీ కళాశాల ప్రహరీని ఆనుకొని ఆధునికంగా తయారు చేసిన షెట్టర్ డబ్బాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మంత్రి కేటీఆర్ ద్వారా ప్రారంభించినట్లు తెలిపారు. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో షాపులను వారికి కేటాయించ లేకపోయినట్లు చెప్పారు. ప్రస్తుతం వాటిని అక్కడి నుంచి ఎందుకు తొలగిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కేవలం బీఆర్‌ఎస్ ప్రభుత్వ పేరు కనిపించకూడదని వాటిని తొలగించి పేదలకు అన్యాయం చేయడం సరికాదన్నారు. తాను ఎంతో శ్రమ కోర్చి నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేస్తే, ప్రస్తుత పాలకులు ఉన్నదానిని నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే నల్లగొండ నడిబొడ్డున రూ.95 కోట్ల వ్యయంతో శంకుస్థాపన చేసిన కళాభారతి ఆడిటోరియం పనులు ఆగిపోయాయని, పానగల్ ఉదయ సముద్రం సందరీకరణ, శిల్పారామం, ఛాయా, పచ్చల, వెంకటేశ్వరాలయ అభివృద్ధి, ఐటీ టవర్ నుంచి 30 ఫీట్ల రోడ్డు వంటి వాటి కోసం మంజూరైన రూ. 120 కోట్లను వేరే పనులను మళ్లించి నల్లగొండ అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతా : గుండా శ్రీనివాస్

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను కలిసిన గుండా శ్రీనివాస్

శాలిగౌరారం, మార్చి 18 : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సారథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతానని గురజాల గ్రామ మాజీ సర్పంచ్ గుండా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆయన గ్రామ కార్యకర్తల అభీష్టం మేరకు తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు చెప్పారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ మండలానికి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి ఈ మేరకు తన నిర్ణయాన్ని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, అమ్మటి అంజయ్య, మామిడి రమేశ్, కమలాకర్, గణేశ్, మాగి రవి, నారగోని వీరయ్య పాల్గొన్నారు.

ఆర్థిక వ్యూహాలతోనే సమాజం పురోభివృద్ధి

• గుల్బర్గా యూనివర్సిటీ ప్రొఫెసర్ వాసుదేవ్

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాసుదేవ్

మిర్యాలగూడ, మార్చి 18: మనం కేవలం విద్యతోనే కాకుండా ఆర్థిక వ్యూహాలతో, ఆర్థిక దృష్టితో సమాజాన్ని మరింత ముందుకు నడిపించవచ్చని గుల్బర్గా యూనివర్సిటీ ప్రొఫెసర్ వాసుదేవ్ సెడెం అన్నారు. స్థానిక కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సెమినార్ ద్వారా మనం ఆర్థిక దృష్టితో కొత్త దారులను, సూత్రాలను, ఆలోచనలను సమర్థవంతంగా ఆవిష్కరించగలిగామన్నారు. ప్రిన్సిపాల్ ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్నాసాగర్, రాపోలు భాస్కర్, డాక్టర్ నరేశ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలి

• హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

పెద్దవూర, మార్చి 18: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పదవ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డీటీడీఏ ఎస్పీ రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీఎంఓ డి.వినాయక్, ప్రధానోపాధ్యాయుడు బాలోజీనాయక్, వసతిగృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, చలకుర్తి, పులిచర్ల హెచ్‌డబ్ల్యూఓలు సుధాకర్, శ్రీనివాస్, అకడమికల్ ఇన్‌స్ట్రక్టర్ రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిజ్ఞాసలో ఎన్జీ విద్యార్థులకు ద్వితీయ బహుమతి

బహుమతి పొందిన ఎన్జీ విద్యార్థులు

రామగిరి, మార్చి 18: నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ద్వితీయ బహుమతి లభించినట్లు కళాశాల ఫిజిక్స్ విభాగం అధ్యాపకుడు ఎం. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కళాశాల విద్యార్థులు జె.రేణుక, ఎస్‌డీ షానూర్‌బాబా, ఆర్.నవీన్, ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, ఎస్.నరేశ్ 'ఆధునిక కలుపుతీత యంత్రం'ను తయారు చేసి ఈ నెల 4న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రదర్శించారు. దాంతో వారి ప్రదర్శనకు రాష్ట్రస్థాయిలో రెండో బహుమతిని విద్యాశాఖ ప్రకటించింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, సీఓఈ బి.నాగరాజులు అభినందించారు.

రేషన్ సరుకులు ఇచ్చే గడువు 23 వరకు పెంపు

చందంపేట, మార్చి 18 : రేషన్‌కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ గడువును ఈ నెల 23 వరకు పొడిగించినట్లు తాసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు ఆథరైజేషన్ కలిగి ఉండాలన్నారు. సమావేశంలో డీటీ గోవర్ధన్‌రెడ్డి, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, డీలర్లు పరమేశ్, పచ్చిపాల కృష్ణయ్య, భాషానాయక్, అనిల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది
నగిల్ల రమేష్, S/o. సత్తయ్య, R/o.H.No.084, ఉట్లపల్లి (గ్రా), గుర్రంపోడు (మం), నల్లగొండ (జి), నా యొక్క పాస్‌పోర్ట్ నెం.C3645626 ఉట్లపల్లి నుండి గుర్రంపోడుకు ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినది దొరికినవారు సంప్ర||9505689303.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, (గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

ఓయూపై ఆంక్షలు ఎత్తివేయాలి

• ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్వీ అసెంబ్లీ ముట్టడికి పిలుపు
• జిల్లాలో ఎక్కడికక్కడ అడ్డుకొని అరెస్ట్ చేసిన పోలీసులు

నకిరేకల్, చండూరు పోలీస్‌స్టేషన్లలో ఉన్న బీఆర్‌ఎస్వీ నాయకులు

నకిరేకల్, మార్చి 18 : ఉస్మానియా యూనివర్సిటీపై రేవంత్‌రెడ్డి సర్కారు విధించి ఆంక్షలను ఎత్తివేయాలని, అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు జిల్లా సంపత్ హెచ్చరించారు. ఆయా డిమాండ్ల సాధనకు మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయని పక్షంలో బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, మంత్రులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో సంఘం జిల్లా నాయకులు కందిగంటి నాగేంద్రబాబు, పాడిశెట్టి మహేశ్, ముక్కాముల శ్రీను, యాతాకుల ప్రవీణ్ ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

మిర్యాలగూడ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.షోయబ్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న పలువురు బీఆర్‌ఎస్వీ నాయకులను టూటౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అడుగడుగునా అక్రమ అరెస్ట్‌లతో, నిర్బంధాలతో నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. పోలీసులు అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మహేశ్‌నాయుడు, హరికృష్ణ, శ్రీధర్ ఉన్నారు.

నార్కట్‌పల్లి : అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్వీ నాయకులు దుబ్బాక శ్రీధర్, పుల్లెంల వెంకట్, వడ్డేపల్లి నాగరాజు, నడింపల్లి నరేశ్, రవి, సత్తి, ముత్తయ్య ఉన్నారు.

త్రిపురారం : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకుడు చాట్ల విజయ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

చండూరు : బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు పనస లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీకి వెళ్తుండగా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు వీరమళ్ల స్వామి, బోయపల్లి సతీశ్ ఉన్నారు.

చందంపేట(దేవరకొండ) : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున అరెస్టు చేసి దేవరకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, పొట్ట మధు ఉన్నారు.

మునుగోడు : పోలీసుల అదుపులో నాయకులు

మిర్యాలగూడ పోలీస్‌స్టేషన్‌లో ..

దేవరకొండ స్టేషన్‌లో బీఆర్‌ఎస్వీ నాయకులు

గతేడాది పేపర్ వ్యాల్యుయేన్ రెమ్యూనరేషన్ చెల్లించాలి

• 20 డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన
• టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి

సమావేశంలో మాట్లాడుతున్న బక్కా శ్రీనివాసాచారి

కొండమల్లేపల్లి, మార్చి 18 : గతేడాది నిర్వహించిన పదో తరగతి పరీక్షల ప్రశ్న ప్రతాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పటికైనా ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పేపర్లు దిద్ది సంవత్సరం గడిచిపోయిందని, మళ్లీ పదో తరగతి పేపర్లు దిద్దే ప్రక్రియ ప్రారంభం అవుతున్నా ఇంతవరకు రెమ్యూనరేషన్ ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. రెమ్యూనరేషన్ అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపనున్నట్లు తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సపావత్ భాను ప్రకాశ్, మండల ఉపాధ్యక్షుడు శ్రీదేవి, ఎస్‌డబ్ల్యూఎఫ్ మండల కన్వీనర్ కోడి నరేందర్, శోభారాణి, నజీరొద్దీన్, నాగార్జున, సుధాకర్, కోటయ్య, శంకరయ్య, మధుసూదన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నల్లగొండ సిటీ/తిప్పర్తి, మార్చి18 : కనగల్ మండలం చిన్నమాదారం గ్రామానికి చెందిన వట్టికోటి ఎల్లేశం (30) మంగళవారం నల్లగొండ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లేశం నల్లగొండలోని బార్‌అండ్ రెస్టారెంట్‌లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం అతడి చెల్లి డెలివరీ ఉండడంతో మిర్యాలగూడకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి నల్లగొండకు బయల్దేరాడు. కానీ ఇంటికి వెళ్లకుండా అర్ధరాత్రి సమయంలో నల్లగొండ రైల్వే సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి : నగేశ్

మర్రిగూడ, మార్చి 18 : మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఊరిపక్క నగేశ్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, రైతులు పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేక ఆయనను సస్పెండ్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అసహనానికి గురవుతుందన్నారు. రాష్ట్రంలో పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతుభరోసా పథకాలు అమలుకు నోచుకోక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకొని జగదీశ్ రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బంగారం వ్యాపారి ఆత్మహత్య

నకిరేకల్, మార్చి 18 : పట్టణంలోని బొడ్రాయి బజారులో నివాసం ఉంటున్న బంగారం వ్యాపారి షేక్ శంషుద్దీన్(39) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ శంషుద్దీన్ తన తండ్రి షేక్ అబ్బాస్‌తో కలిసి స్థానిక మసీదు సమీపంలో బంగారం దుకాణం పెట్టి వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం షాపును మూసి ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రి శంషుద్దీన్ తిరిగి షాపునకు వచ్చి బంగారంలో కలిపే లిక్విడ్ తాగాడు. రాత్రి 12 దాటినా కుమారుడు ఇంటికి రాక పోవడంతో తండ్రి షాపు వద్దకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న శంషుద్దీన్‌ను గమనించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి అబ్బాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

సంక్షిప్తంగా..

నల్లగొండలో ఇగ్నో పరీక్ష కేంద్రం

రామగిరి, మార్చి 18: నల్లగొండలోని వీటీ కాలనీలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఇగ్నో స్టడీ సెంటర్‌లో సదరు యూనివర్సిటీ పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లి ఇగ్నో పరీక్షలు రాయలేని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు స్టడీ సెంటర్‌ను , సెల్: 9985525003ను సంప్రదించాలని కోరారు.

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

చిట్యాల, మార్చి 18 : మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు శివనేనిగూడెంలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ శివనేనిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం అందించారు. డంపింగ్ యార్డులో చెత్తను తగుల బెట్టడం వల్ల పొగతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు.

కట్టంగూర్ పశువుల సంత వేలం

కట్టంగూర్, మార్చి 18 : కట్టంగూర్ గ్రామ పంచాయతీ పశువుల సంత, తైబజారు నిర్వహణ కోసం మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. పశువుల సంతకు కట్టంగూర్‌కు చెందిన చెరుకు నర్సింహ రూ.31.80 లక్షలు, తైబజారుకు కట్టంగూర్‌కు చెందిన పంతంగి రాములు రూ.1.80లక్షలకు వేలం పాడి కైవసం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ తెలిపారు. గతేడాది కంటే పశువుల సంతకు రూ.25వేలు, తైబజారుకు రూ. 5వేలు ఎక్కువ ఆదాయం లభించినట్లు ఆయన పేర్కొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కొండమల్లేపల్లి, మార్చి 18 : దేవరకొండలోని చంద్రన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలకు మంగళవారం సిలింగ్ ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పున్న మల్లేశ్వరి, ఫౌండేషన్ సభ్యులు హన్మంతు సాయి చంద్ర, కొమ్మనేని ఆంజనేయులు, గిరి, సైదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లె రవికుమార్‌కు పలువురి పరామర్శ

మర్రిగూడ,మార్చి 18 : ఇటీవల కింద పడి కాలుకు గాయమై ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్న కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌ను మంగళవారం బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ కార్యదర్శి సుంకరి మల్లేశ్ గౌడ్, నాయకులు సంకబుడ్డి జానేశ్ యాదవ్, వెంకటేశ్ గౌడ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆర్డీఓ కార్యాలయంలో చలివేంద్రం

రామగిరి, మార్చి 18: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జగిని టెక్స్‌టైల్స్,దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆర్డీఓ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగిని వెంకన్న, డాక్టర్ ఆదిత్య, సతీశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి : ఆర్డీఓ శ్రీదేవి

చండూరు, మార్చి18 : వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ వి.శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో తాసీల్దార్ జి.దశరథ, ఎంపీడీఓ బి.యాదగిరి, ఎంపీఓ జె.మాధవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామచంద్రయ్య, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ

చిట్యాల, మార్చి18 : మండలంలోని నేరడ గ్రామంలో నల్లగొండ స్నేహక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. పేద మహిళలకు 45 రోజులు కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ఉచితంగా కుట్టు మిషన్లు కూడా ఇవ్వనున్నట్లు క్లబ్ ప్రెసిడెంట్ యాస సరళ తెలిపారు. కార్యక్రమంలో గడ్డం ప్రదీప్ రెడ్డి, జెల్ల ఇందిర, శారద, దీపిక పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని వినతి

మిర్యాలగూడ, మార్చి 18: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీసీలకు అవకాశం కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. ఆయన వెంట బూర శ్రీనివాస్‌గౌడ్, గోదా రవీందర్, చంద్రమోహన్ ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మిర్యాలగూడ రూరల్, మార్చి18 : ఆటోను లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని శ్రీనివాస్‌నగర్ వద్ద కోదాడ-జడ్చర్ల రహదారిపై చోటు చేసుకొంది. రూరల్ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లికి చెందిన నెమలికంటి ఆంజనేయులు తన ఆటోతో మిర్యాలగూడ నుంచి దేవరకొండ వైపు వెళ్తూ లారీ అసోసియేషన్ స్టేజీ వద్ద బీహార్‌కు చెందిన కృష్ణకుమార్(22)ను ఎక్కించుకున్నాడు. శ్రీనివాస్‌నగర్ వద్ద మిర్యాలగూడ నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న లారీ ఆటోను వెనుక నుంచి ఢీకొటింది. దాంతో ఆటోలో ఉన్న కృష్ణకుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోని తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

• కలెక్టర్ ఇలా త్రిపాఠి

చందంపేట : అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, మార్చి 18: యాసంగి ధాన్యం సేకరణకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పౌరసరఫరాలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయాదిత్య భవన్‌లో ధాన్యం కొనుగోలు నిర్వాహకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సీజన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 ఇవ్వనున్నదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 375 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా ఇందులో 304 కేంద్రాలు దొడ్డు ధాన్యం, 71కేంద్రాలు సన్న ధాన్యానికి కేటాయించనట్లు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం హరీశ్, డీఏఓ శ్రవణ్‌కుమార్, డీసీఓ పత్యానాయక్, డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి పాల్గొన్నారు. అనంతరం జాతీయ రహదారి 565కు సంబంధించిన అధికారులతో సమావేశమై పనుల అవార్డు పూర్తి చేసి పనుల వేగాన్ని పెంచాలని ఆదేశించారు.

కేజీబీవీ, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

చందంపేట : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం చందంపేట మండలంలో పర్యటించారు. స్థానిక పీహెచ్‌సీ, కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ 9,10 తరగతుల విద్యార్థులకు కాసేపు పాఠాలు బోధించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి, డిప్యూటీ తాసీల్దార్ గోవర్ధన్, ఎస్ఓ. కవిత, అనిల్ ఉన్నారు.

ఏప్రిల్ ఒకటిన తుది ఓటరు జాబితా : అదనపు కలెక్టర్

నిడమనూరు : మాట్లాడుతున్న అదనపుకలెక్టర్ శ్రీనివాస్

నకిరేకల్/నిడమనూరు, మార్చి 18 : ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పుల అనంతరం వచ్చే నెల 1వ తేదీన తుది జాబితాను అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా ప్రదర్శించనున్నట్లు అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం నకిరేకల్, నిడమనూరు తాసీల్దార్ కార్యాలయాల్లో నియోజకవర్గ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఓటరు జాబితాలో వచ్చిన మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్లకు సంబంధించిన వివరాలను అన్ని రాజకీయ పార్టీలకు అందించినట్లు పేర్కొన్నారు. పార్టీల వారు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో తాసీల్దార్లు ఎస్‌కే జమీరొద్దీన్, జంగాల కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులకు సహకరించాలి

• సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ, మార్చి 18: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. ఆన్‌లైన్‌లో రోజువారీగా నమోదవుతున్న ఫామ్-6,7,8ల పరిష్కారం, డుబ్లికేట్ ఓటర్ల తొలగింపు, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం వంటి అంశాలపై మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. దాంతో పాటు ఓటరు చిరునామాలో మార్పు, బదిలీలు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, సురేశ్, పుష్పలత, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, జేఏ ఫణి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి, మార్చి 18: విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. మంగళవారం డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన సే నోటు డ్రగ్స్ పోస్టర్లను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100 లేదా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మల్లం మహేశ్, శంకర్, గుండాల నరేశ్, స్పందన, సిరి పాల్గొన్నారు.

నిడమనూరు : డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను మంగళవారం తాసీల్దార్ జంగాల కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు మల్లికంటి చంద్రశేఖర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, నాయకులు కోటేశ్, గుర్వయ్య, బాలనారాయణ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు రూ. 18వేల వేతనం అందించాలి

• తాసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆశాల ధర్నా

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

మిర్యాలగూడ/మర్రిగూడ, మార్చి 18 : ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం అందించాలని, ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ, మర్రిగూడ తాసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తాసీల్దార్లు హరిబాబు, బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల యాదయ్య, ఎస్‌కే. తాహెరా, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జంపాల పద్మ, కార్యదర్శి ఏర్పుల పద్మ, పానుగోటి సునీత, పల్లె కౌసల్య, బూరుగు ధనమ్మ, యాద మ్మ, జ్యోతి, స్వర్ణ, రాజేశ్వరి, రమాదేవి, మాధవి, మంగతాయారు, సరిత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

నార్కట్‌పల్లిలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కట్టంగూర్,మార్చి 18 : మండలంలోని మునుకుంట్ల ప్రభుత్వం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల పవన్, హెచ్‌ఎం షమీం బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కేమ వెంకటేశ్ పరీక్ష సామగ్రి అందించారు. మండలంలోని నెమ్మాని జడ్పీహెచ్‌ఎస్‌లో ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు.

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలోని మోడల్‌స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గీతాంజలి, జేఎంజే పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ అందించిన పరీక్ష సామాగ్రిని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ కృష్ణమోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, చార్టర్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని నీలాయగూడెం జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ పదవ తరగతి విద్యార్థులకు మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నిడమనూరు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిరేకల్ : లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం చందుపట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం లోకసాని అనితారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు, కార్యదర్శి వై. యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.